కలెక్టర్‌చే ఇవిఎంల గొడౌన్ తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక కలెక్టరేట్‌లోని ఇవిఎం యంత్రాలు, వివిప్యాట్లు భద్రపర్చే గొడౌన్‌ను జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇవిఎం గొడౌన్ తాళాలు, సీసీ కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు మొదలైనవి పరిశీలించారు. అనంతరం సెక్యూరిటీ లాగ్‌బుక్‌ను పరిశీలించి అందులో సంతకం చేశారు. ఇవిఎం గొడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

గొడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

పింఛన్.. పరేషాన్..!

సామాజిక పెన్షన్ల పంపిణీలో మండలాధికారుల అత్యుత్సాహం

తెల్లవారుజామున 5 గంటలకు రావాలని సిబ్బందికి హుకుం

6 గంటలకు లాగిన్ కావాలనే ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు

పంపిణీకి అత్యధిక పంచాయతీ కార్యదర్శులు దూరం

రెండు జిల్లాల్లో దాదాపు 9వేల మంది ఉద్యోగుల అవస్థలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సామాజిక పెన్షన్ల పంపిణీలో మండలాధికారుల అత్యుత్సాహంపై సచివాలయ, ఇతర ఉద్యోగుల్లో అసహనం వ్యక్తమవుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాలకు భిన్నంగా ఆదేశాలిస్తూ ఉద్యోగులను తీవ్ర ఇబ్బందుల గురిచేస్తున్న పరిస్థితి మండల, గ్రామస్థాయిలో నెలకొంది. ఒకటో తేదీన పెన్షన్ అందించడం అందరూ హర్షించదగిన విషయం. అందుకూనూ తెల్లవారుజామున ఐదు గంటలకు లాగిన్ అయ్యి పెన్షన్ల పంపిణీ చేయాలని మండల అధికారులు హుకుం జారీ చేయడం ఏమిటో అర్థంకాని పరిస్థితి నెలకొంది. గతంలో వాలంటీర్లు ఉదయాన్నే పెన్షన్ల పంపిణీ చేసి తర్వాత తమ సొంత పనులు చేసుకునేవారు. ఉద్యోగుల పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా ఉంది. తెల్లవారుజామున ఐదు గంటలకు విధుల్లో చేరినా సాయంత్రం ఐదు గంటల వరకూ డ్యూటీలో ఉండాలని పంచాయతీ కార్యదర్శులు పనులు అప్పగిస్తున్నారు. దీంతో మహిళా ఉద్యోగులు పిల్లల విషయంలోనూ, వంట చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాస్తవానికి జిల్లా ఉన్నతాధికారులు చెబుతున్న సమయం ఉదయం ఆరు గంటలు. మండలాధికారులు మాత్రం ఐదు గంటలకే రావాలంటూ సచివాలయ ఉద్యోగులకు హుకుం జారీ చేస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రతినెలా ఒకటో తేదీన పశ్చిమగోదావరి జిల్లాలో 2,32,885 మందికి రూ.155.71 కోట్లు వివిధ సామాజిక పెన్షన్ల కింద పంపిణీ జరుగుతోంది. ఏలూరు జిల్లాలో 2,68,535 మందికి రూ.182.73 కోట్లు పెన్షన్ల కింద అందిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు వాలంటీర్లు పెన్షన్ పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయ ఉద్యోగులు, స్కూళ్లలో పని చేసే జూనియర్, రికార్డు అసిస్టెంట్లు, అంగన్‌వాడీ ఉద్యోగులతో పెన్షన్ల పంపిణీ చేయిస్తున్నారు. ప్రతినెలా ఒకటో తేదీన పశ్చిమగోదావరి జిల్లాలో 4,015 మంది, ఏలూరు జిల్లాలో ఐదు వేల మంది వరకూ ఉద్యోగులు పెన్షన్ల పంపిణీలో పాల్గొంటున్నారు. సచివాలయ ఉద్యోగులు మాత్రం పూర్తిస్థాయిలో పెన్షన్ల పంపిణీలో ఉంటున్నారు. ప్రతి ఉద్యోగీ 50 నుంచి 60 మందికి పెన్షన్ సొమ్ము అందిస్తున్నారు. ఒకటో తేదీకి ముందు రోజు సచివాలయ ఉద్యోగి అయిన సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ పెన్షన్ సొమ్ము బ్యాంకు నుంచి డ్రా చేసి ఉద్యోగులందరికీ ఇస్తున్నారు. ఉద్యోగులు ఉదయం ఎనిమిది, తొమ్మిది గంటలకు ప్రారంభించినా మధ్యాహ్నానికి పెన్షన్ల పంపిణీ పూర్తిచేసే అవకాశం ఉంది. తెల్లవారుజామున ఐదు గంటలకు పెన్షన్ల పంపిణీ చేయాలని మండలాధికారులు ఆదేశించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. శీతాకాలం ప్రారంభమైంది. ఉదయం ఐదు గంటలకు చీకటిగానే ఉంటుంది. అటువంటి సమయంలో మహిళా ఉద్యోగులు పెన్షన్ సొమ్ము తీసుకుని బయటికి వస్తుంటే కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. తెల్లవారుజామున అందుబాటులో ఉన్న కుటుంబాల్లోని సభ్యులు కూడా ఉద్యోగులపై అసహనం వ్యక్తం చేస్తున్న పరిస్థితి ఉంది. మండలాధికారుల అతిని కట్టడి చేసి సచివాలయ, ఇతర ఉద్యోగులకు ఊరట కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పెన్షన్ల పంపిణీకి పంచాయతీ కార్యదర్శులు దూరం

గ్రామ సచివాలయ, పంచాయతీ సిబ్బంది పూర్తిస్థాయిలో పెన్షన్ల పంపిణీలో పాల్గొనాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. అత్యధిక భాగం పంచాయతీ కార్యదర్శులు పెన్షన్ల పంపిణీలో పాల్గొనడం లేదు. దీంతో ఉద్యోగులే ఆ పెన్షన్లను పంపిణీ చేయాల్సి వస్తోంది. దీంతో మరింత ఆలస్యమవుతోంది. ఉదయం ఐదు గంటలకే విధుల్లో చేరినప్పటికీ సచివాలయ ఉద్యోగులకు సాయంత్రం ఐదు గంటల వరకూ వివిధ పనులు అప్పగిస్తున్నారు. దీంతో ఆయా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. సచివాలయ ఉద్యోగులు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ విధుల్లో ఉండాలని ప్రభుత్వ నిబంధనలు చెబుతున్నాయి. ఒకటో తేదీతోపాటు ఇతర రోజుల్లోనూ ఉదయం పది గంటలకే సచివాలయ ఉద్యోగులు రావాలని పంచాయతీ కార్యదర్శులు హుకుం జారీ చేస్తున్నారు. దీంతో సచివాలయ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఎదురు ప్రశ్నిస్తే పనుల పేరుతో తీవ్రంగా వేధిస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. సచివాలయ వ్యవస్థపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. తాము అధికారంలోకి వస్తే నెలకు రూ.పదివేల వేతనంతో వాలంటీర్లను నియమిస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా ఇప్పటి వరకూ వాలంటీర్ల నియామకం చేపట్టలేదు. వాలంటీర్లను నియమిస్తే పెన్షన్ల పంపిణీలో ఇబ్బందులు తొలగే అవకాశం ఉంది.

దీపావళి ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి

మంత్రి కొలుసు పార్థసారథి

జిల్లాలోని ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య దీపావళి పండుగను జరుపుకోవాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఈ పండుగ అందరి జీవితాల్లో మంచిని తీసుకురావడంతోపాటు వారి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆయన ఆకాంక్షించారు. బాణసంచా విషయంలో పిల్లల పట్ల పెద్దలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు తమ తమ రంగాల్లో మరింత ఉత్సాహంతో విజయాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలి

ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజల జీవితాల్లో ఈ దీపావళి వెలుగులు నింపాలని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. ఆయన జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి పండుగను జిల్లా ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్త

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

దీపావళి పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ జిల్లా ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి దీపావళి ప్రతీకని పేర్కొన్నారు. దీపావళి పండుగను ఉత్సాహంగా జరుపుకునే సమయంలో టపాసులు కాల్చేటప్పుడు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

బకాయి వేతనాలివ్వాలని 108 సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తమ మూడు నెలల బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మండలంలోని 108 ఉద్యోగులు బుధవారం స్థానిక పిహెచ్‌సి ఎదుట నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర సేవలందిస్తూ 24 గంటలపాటు విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి మూడు నెలలుగా పెండింగులో ఉన్న జీతాలు విడుదల చేయాలని, అదేవిధంగా ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పుల్లారావు, ఆనంద్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిబ్బంది

దంచికొట్టిన వర్షం

కాల్వలను తలపించిన రోడ్లు

ఏలూరులో రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు గంటకుపైగా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఆర్ఆర్‌పేట, శ్రీనివాస థియేటర్ రోడ్డు ప్రాంతాల్లో సుమారు నాలుగు అడుగుల మేర నీరు రోడ్లపై నిలిచింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్రెయినేజీ నీరు సైతం వర్షపునీరుతో కలిసి రోడ్లపై పొంగి పొర్లడంతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. దీపావళి పండుగ నిమిత్తం ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన 48 బాణాసంచా దుకాణాలు నీట మునిగాయి. దీంతో వ్యాపారస్తులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఇండోర్ స్టేడియంలో వర్షపు నీటిని మున్సిపల్ అధికారులు మోటార్ ద్వారా తొలగిస్తున్నారు. పండుగ రోజు కూడా వర్షం పడితే ఏం చేయాలోననే ఆందోళనలో వ్యాపారస్తులు ఆందోళనకు గురవుతున్నారు.

ఏలూరు ఇండోర్ స్టేడియంలో బురద

వ ం ు ది నే ప ల్లి : మండలంలో బుధవారం మధ్యాహ్నం వర్షం దంచికొట్టింది. సుమారు గంటపాటు కురిసిన భారీ వర్షంతో ప్రధాన రహదారులు, గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆర్‌అండ్‌బి రహదారుల గుంతల్లో నీరు చేరడంతో దారి కానరాక ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు పల్లపు కాలనీల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. భారీ వర్షానికి బాణాసంచా దుకాణాల షామియానాలు నేలకొరిగాయి. దీంతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కుక్కునూరు: మండలంలో భారీ వర్షం కురిసింది. మిర్చి, పెసర, కంది, పత్తి రైతులు ఈ వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో కుక్కునూరులో భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఫీల్డ్ లేబర్ సొసైటీ భూముల సమస్య పరిష్కరించాలి

రెవెన్యూ గ్రామసభలో అధికారులకు వినతి

ప్రజాశక్తి - మండవల్లి



వినతి అందిస్తున్న నేతలు, బాధితులు

ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ భూముల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పెత్తందారుడైన మాడపాటి కృష్ణ ప్రసాద్ అధీనంలో ఉన్న సింగనపూడి దళితుల ఫీల్డ్ లేబర్ సొసైటీ భూములను దళితులకు అప్పగించాలని కోరుతూ రెవెన్యూ గ్రామసభలో ఆయన బాధితులతో కలిసి అధికారులకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ పేరుతోనే రెవెన్యూ రికార్డుల్లో భూమి ఉందన్నారు. అయితే కైకలూరు చెందిన పెత్తందారుడు మాడపాటి కృష్ణ ప్రసాద్ దళితులపై దౌర్జన్యానికి దిగడం తగదన్నారు. జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు పెండింగ్లో ఉందని, వెంటనే తుది తీర్పు ఇచ్చి దళితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం మండల సర్వేయర్ ఎస్.రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కర్ర జగదీష్, సభ్యులు పక్కిరి దావీదు, పాముల యెహోషువా, మురారి ఆదాము, పక్కిరి జేమ్స్, ఇంటి సురేష్, బొడ్డు చింతయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంజి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

పండుగ వేళ పెను విషాదం

సూర్యారావుపాలెం ఘటనలో మృతులు, క్షతగాత్రులు పశ్చిమవాసులే

ఇద్దరు దుర్మరణం, ఐదుగురికి తీవ్ర గాయాలు

శోకసంద్రంలో దువ్వ, రావిపాడు

ప్రమాద స్థలం

ప్రజాశక్తి - తణుకు రూరల్

అంతా దీపావళి హడావుడిలో ఉన్నారు. దీపావళి సామగ్రి తయారీ కేంద్రంలోని మహిళలు కూడా త్వరగా పని ముగించుకుని ఇంటికి వెళ్లాలనే ఆలోచనల్లో ఉన్నారు. మరోపక్క మబ్బు, ఉరుములు.. అదే సమయంలో తాము పని చేసే తయారీ కేంద్రానికి ఆనుకుని ఉన్న కొబ్బరి చెట్లపై పిడుగులు పడడం, ఆ నిప్పురవ్వలు తయారీ కేంద్రంపై పడి బాణసంచాకు నిప్పంటుకుని మంటలు ఎగసిపడడం క్షణాల్లో జరిగిపోయింది. తేరుకుని బయట పడేలోపే మంటలు చుట్టుముట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. మరో పది మంది స్వల్ప గాయాలపాలయ్యారు. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం శివార్లలో బుధవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటన పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకు మండలం దువ్వ, పెంటపాడు మండలం రావిపాడు గ్రామాల్లో పెనువిషాదాన్ని నింపింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. దువ్వకు చెందిన వేగిరోతు శివ బాణసంచా తయారీ కేంద్రం నిర్వహిస్తాడు. గతంలో దువ్వలోనే ఈ కేంద్రం నిర్వహిస్తుండగా గత సంవత్సరం ఈ కేంద్రానికి అధికారులు అనుమతి ఇవ్వలేదు. దీంతో ఆయన తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అనుమతులు తెచ్చుకుని సూర్యారావుపాలెంలో తయారీ కేంద్రం నిర్వహిస్తున్నాడు. ఇక్కడ పని చేయడానికి దువ్వ, రావిపాడు గ్రామాల నుంచి మహిళలను తీసుకెళుతుంటారు. అదే విధంగా సుమారు 15 మందికిపైగా మహిళలు, మరికొంత మంది పురుషులు ఈ కేంద్రానికి పని నిమిత్తం వెళ్లారు. బుధవారం సాయంత్రం పిడుగుపాటు వల్ల చెలరేగిన మంటల్లో తయారీ కేంద్రం యజమాని భార్య వేగిరోతు శ్రీవల్లి (25), పెంటపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన గుమ్మడి సునీత (38) అక్కడికక్కడే మృతి చెందారు. కావలిపురానికి చెందిన విప్పర్తి వెంకటేశ్వరరావు, రావిపాడుకు చెందిన మందలంక కమలారత్నం, శీలం లక్ష్మి, దువ్వకు చెందిన కడిమి కుమారి, దాశెట్టి పద్మ తీవ్రంగా గాయపడ్డారు. మరో పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి తీవ్రంగా గాయపడిన ఐదుగురిని ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. తణుకు ఆస్పత్రిలో క్షతగాత్రులను తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, నిడదవోలు మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు పరామర్శించారు.

క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

మృతుల్లో ఒకరైన సునీతకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త అట్టల ఫ్యాక్టరీలో కార్మికునిగా పని చేస్తుండగా కుమారుడు ఇంటర్‌తో చదువు ఆపేసి కూలి పనులకు వెళుతున్నాడు. కుమార్తె ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది.

ప్రమాదం పట్ల కలెక్టర్ దిగ్భ్రాంతి

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

భీమవరం: తూర్పుగోదావరి జిల్లాలోని సూర్యారావుపాలెంలో పిడుగుపాటుకు బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదం పట్ల జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పండుగ సమయంలో ఇటువంటి సంఘటన జరగడం దురదష్టకరమన్నారు. తణుకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. వారి కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు.

తేమశాతం నిబంధనలు సడలించాలి

రైతు, కౌలు రైతుసంఘాల నాయకులు వినతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

వినతి అందిస్తున్న నేతలు

తేమశాతం నిబంధనలు సడలించి రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటరావు, ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కోకన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి కోరారు. బుధవారం కైకరంలోని రైతుసేవా కేంద్రంలో జరిగిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారికి రైతుసంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ వరి కోతల సమయంలో వర్షాలు కురవడంతో తేమ శాతం పెరిగిందని, ఆరబెట్టడానికి అవకాశం లేక అన్నదాతలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. తేమశాతం నిబంధనలు సడలించి ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలని కోరారు. తూకాల్లో మోసాలు జరగకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి బోరు నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి - ఉంగుటూరు

గోపీనాథపట్నం కాలనీలో పంచాయతీ తాగునీటి బోరు చెడిపోయింది. మండల పరిషత్ నిధులు రూ.మూడు లక్షలతో కొత్తగా బోరు నిర్మించి బుధవారం వాటిలో పైపులను అమర్చినట్లు సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి చెప్పారు. తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వరం స్పందించి నిధులిచ్చిన మండల పరిషత్ అధ్యక్షురాలు గంటా శ్రీలక్ష్మికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

పైపుల అమరిక

ఒఎన్‌డిసి సేవల అమలుకు ప్రత్యేక కార్యాచరణ

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక ఉత్పత్తులను, ఉత్పత్తిదారులను ప్రోత్సహించేందుకు ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఒఎన్‌డిసి) సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒఎన్‌డిసి ప్లాట్‌ఫారంలో జిల్లాలోని మండలాలవారీగా ఒక ఉత్పత్తిని విక్రయాలకు ఉంచే విధంగా వ్యవసాయ, ఉద్యాన, డిఆర్‌డిఎ, ఐటిడిఎ తదితర శాఖలు అర్హులైన వారిని గుర్తించాలన్నారు. ఎంఎస్‌ఎంఇ కింద ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి ఆయా ఉత్పత్తులను ఒఎన్‌డిసి ప్లాట్‌ఫారంలోకి తీసుకొచ్చేందుకు ఉద్యాన శాఖ డిడి, ఎల్‌డిఎంలు ప్రధాన భూమిక వహించాలన్నారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు వారు తయారు చేసే వివిధ పచ్చళ్లు, జ్యూట్‌బ్యాగ్స్ ఇతర వంటకాలు తదితరాలను ఈ విధానం ద్వారా విక్రయించేలా డిఆర్‌డిఎ, మెప్మా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఒఎన్‌డిసి) మారుమూల ప్రాంతాల్లో ఉన్న చిన్న వ్యాపారులు, ఉత్పత్తిదారులకు ఒక వేదికగా నిలుస్తుందన్నారు. ఐటిడిఎ పరిధిలో వెదురుతో అద్భుతమైన నైపుణ్యం, క్రియేషన్‌తో తయారుచేసే ఉత్పత్తులతోపాటు 10 రకాల గిరిజన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి సంబంధించిన అన్ని విషయాలపై సంబంధిత ఉత్పత్తిదారులు, మహిళలకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఒఎన్‌డిసి ఉత్పత్తులను ప్రమోట్ చేసేందుకు ప్రత్యేక వీడియోను కూడా రూపొందించాలన్నారు. దీనికి సంబంధించిన కార్యాచరణ 10 రోజుల్లో రూపొందించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 110 పరిశ్రమల్లో చైల్డ్ కేర్, ఫీడింగ్ రూములను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని, ఇప్పటికే 70 పరిశ్రమల్లో ఏర్పాటు చేశారని, మిగిలిన వాటిలో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిశ్రమల్లో భద్రతా చర్యలకు సంబంధించి చేపట్టిన తనిఖీలను వచ్చే నెలాఖరునాటికి పూర్తిచేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఉపాధిహామీ కార్యక్రమం (పిఎంఇజిపి) కింద పరిశ్రమల ఏర్పాటుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సింగిల్ డెస్క్ కింద వివిధ పరిశ్రమల ఏర్పాటుకు 173 దరఖాస్తులు రాగా వాటిలో 166కు ఆమోదం తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఆరింటిని వెంటనే పరిష్కరించాలన్నారు. వివిధ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూముల విషయంపై ఎపిఐఐసి, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం ఇ.ప్రతాప్, ఇరిగేషన్ ఎస్ఇ సిహెచ్.దేవప్రకాష్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఎల్‌డిఎం డి.నీలాద్రి, ట్రాన్స్‌కో ఎస్ఇ పి.సాల్మన్‌రాజు, వ్యవసాయశాఖ జెడి హబీబ్‌భాషా, ఉద్యానశాఖ డిడి రామ్మెహన్, ఎపిఐఐసి జెడ్ఎం కె.బాబ్జి, సోషల్ వెల్ఫేర్ జెడి జయప్రకాష్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాధరావు, కాలుష్యనియంత్రణ మండలి ఇఇ వెంకటేశ్వరరావు, గ్రౌండ్‌వాటర్ డిడి విజయ్ కుమార్, మత్స్యశాఖ జెడి నాగలింగాచారి, పెప్సీ సభ్యులు ఎన్.వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు సిరా భరత్ పాల్గొన్నారు.

రూ.పది క్వాయిన్లు తీసుకునేలా చర్యలు చేపట్టండి

కలెక్టర్ వెట్రిసెల్వికి సహాయ ఫౌండేషన్ ట్రస్టు వినతి

ప్రజాశక్తి - ఏలూరు

చెల్లుబాటులో ఉన్న పది రూపాయల క్వాయిన్లను కొందరు దుకాణదారులు తీసుకోవడం లేదని, రూ.పది క్వాయిన్లు అంతా తీసుకునేలా చర్యలు తీసుకోవాలని సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ వీరమల్ల మధు కలెక్టర్ వెట్రిసెల్వికి బుధవారం వినతి అందించారు. జిల్లాలో కొందరు వ్యాపారస్తులు రూ.పది క్వాయిన్లను తీసుకోవడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రజల్లో అపోహలు పెరిగిపోతున్నాయని, దీనిపై అందరికీ అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వినతి అందిస్తున్న ప్రతినిధులు

కామవరపుకోట మండలంలో ఎండు చెట్ల తొలగింపు, విద్యుత్ ట్రాన్స్‌ఫారం మార్పు పనులు ఫోన్ కాల్ ద్వారా పరిష్కరించడంపై కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అందరం కలిసికట్టుగా పనిచేయాలి

చింతలపూడి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి కూటమి ప్రభుత్వానికి, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌కు మంచి పేరు తీసుకొచ్చేలా అందరం కలిసికట్టుగా పని చేయాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు దేవా, భారతి అన్నారు. ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ జనరల్ బాడీ సమావేశం సూపరింటెండెంట్ నారాయణరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణుల కేసులు రిఫర్ చేయకూడదన్నారు. జనరల్ కేసులు, డెలివరి కేసులు సాధ్యమైనంత వరకు రిఫర్ చేయకూడదని చెప్పారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సమస్యను, మళ్లీ పునరావృతం పూర్తిగా పరిష్కారం చేస్తున్నామని తెలిపారు. డిప్యూటేషన్‌పై వెళ్లిన వారిని వెంటనే రప్పించాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయురాలు ప్రసన్నలక్ష్మి స్వచ్ఛంద విరమణ

ప్రజాశక్తి - దెందులూరు

ప్రసన్నలక్ష్మిని సత్కరిస్తున్న వక్తలు

పెదవేగి మండలంలోని జగన్నాధపురం ఎంపియుపి స్కూల్ ఉపాధ్యాయురాలు ప్రసన్నలక్ష్మి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ కార్యక్రమం ఎస్‌టియు మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం పెదవేగిలో నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు పూలమాలలు, బొకేలు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఎంఇఒ-1 బుధవ్యాస్, ఎంఇఒ-2 అరుణ్‌కుమార్, ఎస్‌టియు సీనియర్ నాయకులు ప్రసాద్‌రాజు, నారాయణ, పెదవేగి మండల నాయకులు నాగార్జున, ఎండి షపి పాల్గొని వారి సేవలను కొనియాడారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - చింతలపూడి

యుటిఎఫ్ స్వర్ణోత్సవ ఉత్సవాలను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా నాయకులు పురేటి శ్రీనివాసరావు అన్నారు. చింతలపూడి లయన్స్ క్లబ్‌లో యుటిఎఫ్ మండల శాఖ స్వర్ణోత్సవ నూతన కౌన్సిల్ సమావేశం జిల్లా కార్యదర్శి పురిటి శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.ముస్తావలీ, పరిశీలకులుగా, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు టి.ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షునిగా కె.దామోదర్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా చెంచం రాజు, ఆరెంటీ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను పురేటి శ్రీనివాసరావు అభినందించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కల్లాలోనే ధాన్యం నాణ్యత నిర్ధారించాలి

ఏలూరు అర్బన్ : ఏలూరు జిల్లాలో రైతులు, కౌలురైతులు పండించిన ధాన్యాన్ని కల్లాలోనే క్వాలిటీ నిర్ధారణ చేసి మిల్లర్లకు తరలించాలని ఎపి కౌలు రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. జెడిని కలిసిన వారిలో ఎపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గన్ను వెంకట్రావు, కార్యదర్శి దొంత కృష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, రైతు సంఘం జిల్లా నాయకులు వరప్రసాద్ ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీక్కొ వ్యాన్

వ్యాన్ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఆగి ఉన్న కంటైనర్‌ను వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టిన ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన దావులూరి డేవిడ్ (46) వ్యాన్ డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఆయన వ్యాన్‌లో అమలాపురం నుంచి విజయవాడకు చీపుర్ల లోడుతో బయలుదేరాడు. బుధవారం ఉదయం ఏలూరు నగర శివారు ఆశ్రం ఆసుపత్రి సమీపంలోకి వచ్చేసరికి జాతీయ రహదారిలో రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన డేవిడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాలికను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

బాలికను వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ క్రాంతిప్రియ తెలిపిన వివరాల ప్రకారం... దెందులూరు మండలానికి చెందిన బాలిక పెదవేగి మండలం ప్రయివేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. అదే పాఠశాలకు వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న పెదవేగి మండలం కూచిపూడి ప్రాంతానికి చెందిన వెంకటేశ్వరరావు బాలికకు మాయమాటలు చెబుతూ అప్పుడప్పుడు ఫోన్లు కూడా చేస్తూ ఉండేవాడు. కొంతకాలం క్రితం ప్రయివేట్ పాఠశాల యాజమాన్యం వెంకటేశ్వరరావును విధుల నుంచి తొలగించింది. అయినప్పటికీ వెంకటేశ్వరరావు బాలికకు తరచూ ఫోన్ చేస్తూ వేధించసాగాడు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం బాలిక కుటుంబ సభ్యులతో కలిసి ఓ ప్రయివేట్ ఫంక్షన్‌కు వెళ్లింది. అదే సమయంలో అక్కడికి చేరుకున్న వెంకటేశ్వరరావు బాలికను బలవంతంగా బండిపై ఎక్కించుకుని వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అతడిని పట్టుకుని మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఏలూరు మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ క్రాంతిప్రియ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టి.నరసాపురంలో చోరీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.జయబాబు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన టి.నరసాపురం గ్రామానికి శీలం లాజర్ ఈ నెల 24వ తేదీన ఇంటికి తాళం వేసి కుటుంబీకులందరూ చర్చికి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా లాకర్ పగులగొట్టి అందులో ఉన్న మూడు బంగారపు ఉంగరాలు కలిపి రూ.24 వేల విలువైన ఆరు కాసుల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

చింతలపూడి : మండలంలోని పోతునూరు, మల్లాయగూడెం ఎసి అగ్రహారంలో పేకాట స్థావరాలపై సిఐ రవీంద్ర తన సిబ్బందితో బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2.500 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు.

చోరీకి గురైన బంగారు నగలు దొరికాయి

ముదినేపల్లి : చోరీ గురైన బంగారు ఆభరణాలు ఎట్టకేలకు బుధవారం దొరికాయి. ముదినేపల్లిలోని మసీదు బజార్‌కు చెందిన అబ్దుల్ సలాం (టీవీ మెకానిక్) ఇంట్లో ఈ నెల 23వ తేదీ సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న సుమారు నాలుగు కాసుల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించిన బంగారు ఆభరణాలను తీసుకొచ్చి ఇంటి ఆవరణలో ఉన్న మల్లెపూల చెట్టు దగ్గర పడేసి వెళ్లారు. చెట్టు మొదట్లో తన నగలు కనిపించడంతో సలాం భార్య నజియా ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

మందు గుండు సామగ్రి పట్టివేత

జీలుగుమిల్లి : దర్భగూడెం గ్రామానికి చెందిన కంచర్ల సుబ్బారావు ఎటువంటి లైసెన్స్ లేకుండా మందు గుండు సామగ్రి అమ్ముతున్నాడని ఎస్ఐ పి.నవీన్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. నిల్వ ఉంచిన వివిధ రకాల మందు గుండు సామగ్రిని స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటా

తడికలపూడి ఎస్ఐ పి.చెన్నారావు

ప్రజాశక్తి - కామవరపుకోట

తడికలపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలకు ఎప్పుడు ఏ అవసరమొచ్చినా తాను 24 గంటలూ అందుబాటులో ఉంటానని ఎస్ఐ పి.చెన్నారావు తెలిపారు. ఆయన 2012 ఎస్ఐ బ్యాచ్‌కి చెందిన అధికారి. తడికలపూడి పోలీస్‌స్టేషన్‌లో 27వ ఎస్ఐగా రెండు నెలల క్రితం బాధ్యతలు చేపట్టిన ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న :గతంలో ఏయే ప్రాంతాల్లో పనిచేశారు?

ఎస్ఐ : కొయ్యలగూడెం, రాజమండ్రి, చింతలపూడి, ధర్మాజిగూడెం తదితర ప్రాంతాల్లో ఎస్ఐగా పని చేశాను.

ప్రశ్న : స్టేషన్ పరిధిలో ఏయే అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు?

ఎస్ఐ : మహిళలు, చిన్నపిల్లలపై జరిగే ఆకృత్యాల నివారణ, జూదం, యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రశ్న : దీపావళి పండుగ సందర్భంగా మండలంలో ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

ఎస్ఐ : దుకాణాలను జనావాసాలు తక్కువగా ఉన్న ప్రదేశాల్లో నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నాం. మందుగుండు సామగ్రి అమ్మే దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న దుకాణదారుల లైసెన్సులను పరిశీలించి వారికి శిక్షణ ఇచ్చి ఎక్కడా కూడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా మందుగుండు సామగ్రి అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రశ్న : రాత్రి సమయాల్లో నేరాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్ఐ : రాత్రి సమయాల్లో ప్రతిరోజూ గస్తీ నిర్వహిస్తున్నాం. అనుమానాస్పద, పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టాం.

ప్రశ్న : యువతకు మీరిచ్చే సందేశం ఏంటి?

ఎస్ఐ : గంజాయి, మాదక ద్రవ్యాలు, జూదం చెడు వ్యసనాలకు బానిస కాకుండా, క్రమశిక్షణతో చదువుపై శ్రద్ధ పెట్టి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలి. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు ఉంటాయి. అటువంటి వాటికి దూరంగా ఉండండి.

ప్రశ్న : మండలంలో ఎక్కువగా ఏయే రకాల కేసులు నమోదవుతున్నాయి?

ఎస్ఐ : ఆస్తి, పొలం తగాదాలు నేపథ్య గొడవల వంటి కేసులు నమోదవుతున్నాయి.

ప్రశ్న: సైబర్ నేరాల గురించి ప్రజలకు ఏమైనా చెప్పాలనుకుంటున్నారా?

ఎస్ఐ : అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వాట్సాప్ కాల్స్, సందేశాలకు స్పందించవద్దు. సైబర్ క్రైమ్ నేరాల నివారణకు ప్రజల్లో అవగహన పెంచడం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 12 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు క్రమం తప్పకుండా రక్తమార్పిడి చేయడానికి రక్తదాతల సహకారం మరువలేనిదన్నారు. ప్రస్తుతం ప్రజల్లో రక్తదానంపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. తలసేమియా చిన్నారులకు వారి సహాయకులకు 30 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు కాట్రగడ్డ సయాజీరావుకి అభినందనలు తెలిపారు. రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీ డ్యూనాంట్ 114వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, డాక్టర్ వరప్రసాదరావు, డాక్టర్ జి.స్పందన, ఏలూరు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎన్‌జివిబి.స్వామి, కార్యదర్శి బి.ప్రసాద్, పిఆర్ఒ కెవి.రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక బాధ్యతతో మెలగాలి

ప్రజాశక్తి - దెందులూరు

ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యతతో మెలిగి, దేశ ప్రజలకు మేలు చేయాలని దెందులూరు తహశీల్దార్ బి.సుమతి తెలిపారు. మండలంలోని గోపన్నపాలెంలో ప్రభుత్వ పిఇటి కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యత ఉండాలన్నారు. అనంతరం తహశీల్దార్ సుమతిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

హుండీలు లెక్కింపు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని బలివే గ్రామంలో ఉన్న శ్రీరామలింగేశ్వర ఆలయంలోని నాలుగు హుండీలను లెక్కించినట్లు కార్యనిర్వాహణాధికారి పామర్తి సీతారామయ్య తెలిపారు. రూ.1,32,191 ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

జాబ్‌మేళాలో 11 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 28 మంది యువత హాజరై 11 మంది వివిధ కొలువులకు ఎంపిక చేసినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కుసుమ తెలిపారు. ఈ జాబ్ మేళాలో పొట్లం, లగ్జరీ ల్యాండ్ లార్డ్ యూనివర్సల్ ప్రాజెక్టల కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గోదావరి రేవులు శుభ్రం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం పంచాయతీలో గోదావరి నది తీరంలో కార్తీక మాసం పుణ్య స్నానాల కోసం బుధవారం పంచాయతీ సర్పంచి పొడుం పుష్ప పాలకవర్గ సభ్యులు మంగిన కొండ ఆధ్వర్యంలో రేవులు శుభ్రం చేయించారు. నూతనగూడెం శివాలయం రేవులో కార్తీకమాస స్నానాల రేవును, భక్తులు రాకపోకలు సాగించేందుకు రేవులను యంత్రాలతో యుద్ధప్రాతిపదికన సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో కోడి పోసి, తైలం చందు, పాల్గొన్నారు.

నేడు ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మండలంలో ఎఐటియుసి 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సిపిఐ పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కన్నాయిగుట్ట గ్రామంలో కారం బొజ్జి అధ్యక్షతన బుధవారం గ్రామ శాఖ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కారం దారయ్య మాట్లాడుతూ గ్రామ శాఖల్లో ఏవైనా సమస్యలు ఉంటే మండల కమిటీకి తెలిపాలన్నారు.

సర్దార్ వలభాయ్ పటేల్ జయంతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక కోటదిబ్బలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఏక్తా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల విద్యార్థులు జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేసారు.

చింతలపూడి : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఐక్యత కోసం పరుగు కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ ఎన్‌జెకె.నరేంద్రకుమార్, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఎవిఆర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వాలు

సిపిఎం జిల్లా కార్యదర్శి రవి

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

ప్రభుత్వాలు మారుతున్న పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించకపోగా ఇంకా సృష్టిస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. మండలంలోని స్థానిక సిపిఎం కార్యాలయంలో కారం వెంకట్రావు అధ్యక్షతన బుధవారం మండల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలంలోని నిర్వాసితుల సమస్యలపై, ప్రభుత్వాలు నిర్వాసితుల పట్ల అవలంబిస్తున్న తీరుపై చర్చించారు. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు బహుళార్థక సాధక ప్రాజెక్టు అని, ఆంధ్రప్రదేశ్ జీవనాడి అని ప్రాజెక్టు పూర్తయితే ఆంధ్రప్రదేశ్ స్థితిగతులు మారుతాయని అనడమే కాని, దానికోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితుల సమస్యలు కోకొల్లలుగా అలాగే పేరుకుపోయి ఉన్నాయని ఎద్దేవా చేశారు. అన్నదమ్ముల్లాగా కలిసి మెలిసిన జీవితాల్లో అల్లర్లు సృష్టిస్తున్నాయని, పుట్టినప్పటి నుంచి అదే గ్రామంలో ఉన్నా కుంటి సాకులు చూపుతూ, సర్వేల పేరుతో గందరగోళం సృష్టించి అధికారులు ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు సర్వేలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి అర్హులైన 140 మంది ఇళ్లను లిస్టులో చేర్చి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు నాగమణి, మండల కార్యదర్శి ధర్ముల రమేష్, జిల్లా నాయకులు మడివి దుర్గారావు, మడకం ఏసు, ప్రసాద్ రెడ్డి, నర్సయ్య, వెంకటేశ్వర్లు, దుర్గ పాల్గొన్నారు.

పోలీస్ బాబాయ్ సేవలు మరువలేనివి

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

టిడిపి చింతలపూడి పట్టణ అధ్యక్షులు కీర్తిశేషులు పక్కాల వెంకటేశ్వరరావు (పోలీస్ బాబాయ్) సేవలు మరువలేనివని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పక్కాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ, మాజీ ఎంపిపి మరీదు వెంకట్రావు, నాయకులు అల్లూరి రామకృష్ణ, ఏలూరు పార్లమెంటు రైతు అధ్యక్షులు గుత్తా వెంకటేశ్వరరావు, రైతు కార్యదర్శి కొత్తపూడి శేషగిరిరావు, మాజీ సర్పంచి చిట్లూరి ధర్మరాజు, పార్టీ ప్రగడవరం గ్రామ అధ్యక్షులు తాళ్లూరి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిటిసి మాజీ సభ్యులు కనమత రెడ్డి రాజారెడ్డి, ఎంపిటిసి సభ్యులు రాజేంద్రకపూర్, టౌన్ మాజీ ప్రెసిడెంట్ తాటి అప్పారావు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఖాతాదారుల ప్రయోజనాలకు పెద్దపీట

కెనరా బ్యాంక్ సర్కిల్ హెడ్ విజయలక్ష్మి

కెనరా బ్యాంకును ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఖాతాదారుల ప్రయోజనాలకు కెనరా బ్యాంక్ పెద్దపీట వేస్తుందని, అందుకు అనుగుణంగా ఏలూరు ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో సత్రంపాడులో కెనరా బ్యాంక్ నూతన శాఖను ఏర్పాటు చేశామని కెనరా బ్యాంక్ సర్కిల్ హెడ్ సిజె.విజయలక్ష్మి అన్నారు. ఏలూరులోని సత్రంపాడులో నూతన కెనరా బ్యాంకును బుధవారం కెనరా బ్యాంక్ సర్కిల్ హెడ్ సిజె విజయలక్ష్మి ప్రారంభించారు. తొలుత విజయలక్ష్మికి కెనరా బ్యాంక్ సిబ్బంది పుష్పగుచ్ఛంతో ఆహ్వానం పలికారు. అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ ఖాతాదారుల ప్రయోజనార్థం కెనరా బ్యాంక్ అనేక విశిష్ట సేవలను అందిస్తుందని, వాటిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం రీజనల్ హెడ్ తోట రవిచంద్ర మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాలో మరిన్ని శాఖలను ప్రారంభించాలనే ఉద్దేశంతో ఉన్నామన్నారు. ఖాతాదారులకు ఉన్నతమైన సేవలను తక్కువ సమయంలో అందించాలని బ్యాంకు ప్రణాళికలు అవలంబిస్తుందన్నారు. డిజిటల్‌గా, సాంకేతికంగా మరిన్ని సేవలను అందించే లక్ష్యంతో అడుగులు వేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ లక్ష్మీదివ్య గాయత్రి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని ఇటుకలకోట, వింజరం గ్రామ పంచాయతీల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలకు సంబంధించి పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంపై వ్యవసాయ శాఖ అధికారి రాంబాబు బుధవారం పలు విషయాలు చర్చించారు. వరి పండించే రైతులందరూ కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుని పంట ఉత్పత్తిని అమ్మకాలు జరపాలని, దళారులను నమ్మి మోసపోవద్దని, రబీ సీజన్‌కు సంబంధించి విత్తనం మొక్కజొన్న పంట పండించే రైతులు ముందస్తుగా రైతు సేవా కేంద్రంలో ఉన్న సిబ్బందికి తెలియజేసి సాగు చేసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా విత్తన కంపెనీల నుంచి రాతపూర్వకంగా ఉన్న అగ్రిమెంట్‌ని తీసుకున్న తర్వాత మాత్రమే సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇటికలకోట సర్పంచి సున్నం చంద్రమ్మ, విఆర్ఒ బుచ్చమ్మ, సేంద్రీయ వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి బి.సుమలత సూచించారు. మండలంలోని తిరుమలపేటలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయాధికారి బి.సుమలత అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు నూతన సాంకేతిక వ్యవసాయ పరిజ్ఞానం, కౌలు రైతులకు ప్రభుత్వం అందించే కౌలు కార్డుపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ఉద్యానవన శాఖకు సంబంధించి ఉద్యాన పంటల సబ్సిడీ, వ్యవసాయ పనిముట్లు, మల్చింగ్ షీట్లు, ఎరువులు, విత్తనాలు తదితర అంశాలపై రైతులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, సచివాలయ, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

33 మినీ గోకులాలు మంజూరు

ప్రజాశక్తి - టి.నరసాపురం

టి.నరసాపురం మండలానికి 33 మినీ గోకులాలు(పశువుల షెడ్లు) మంజూరయ్యాయని ఎంపిడిఒ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలో 33 మినీ గోకులాలు మంజూరు కాగా ఒక్కో గోకులం నిర్మాణానికి రూ.2.30 లక్షలు కాగా రూ.23 వేలు రైతు వాటా చెల్లించాలని మిగిలిన రూ.2.07 లక్షలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. వాలు పందిరి ఆకారంలో పది మీటర్ల పొడవు, పది మీటర్ల వెడల్పుతో పది అడుగుల ఎత్తు ఉండేలా షెడ్డు నిర్మించాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులు మండల పశు వైద్యాధికారిని సంప్రదించాలని తెలిపారు

8 బాణసంచా దుకాణాలు ఏర్పాటు

ప్రజాశక్తి - ముదినేపల్లి

దీపావళి సందర్భంగా మండలంలో ఎనిమిది బాణసంచా విక్రయ దుకాణాలకు అనుమతులు ఇచ్చినట్లు ఎస్ఐ వివిఎస్.వీరభద్రరావు బుధవారం చెప్పారు. ముదినేపల్లిలోని వి.కన్వెన్షన్‌హాలు ఆవరణలో నాలుగు దుకాణాలు, సింగరాయపాలెంలో మూడు దుకాణాలు, అల్లూరులో ఒక దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చామన్నారు. బాణసంచా దుకాణదారులు నిబంధన తప్పకుండా పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి పది గంటల తర్వాత బాణసంచా విక్రయాలు నిలిపివేయాలని వ్యాపారులను ఆదేశించారు.

జాతీయస్థాయి పోటీలకు ట్రిపుల్ ఐటి విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈ నెల 29, 30వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి అండర్-19 బాల బాలికల యోగాసన పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన 12 మంది నూజివీడు ట్రిపుల్ ఐటికి చెందినవారే కావడం విశేషం. ఈ రాష్ట్రస్థాయి పోటీల్లో కృష్ణా జిల్లా జట్టు అద్భుత ప్రతిభ ప్రదర్శించి ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించింది. బాలుర జట్టు గోల్డ్ మెడల్, బాలికల జట్టు గోల్డ్ మెడల్, బాలుర అథ్లెటిక్ వ్యక్తిగత విభాగంలో గోల్డ్, సిల్వర్, బ్రాంజ్, ఐదో స్థానం, స్టాండ్ బై, బాలికల అథ్లెటిక్ వ్యక్తిగత విభాగంలో సిల్వర్, బ్రాంజ్, నాలుగో స్థానంతో పాటు స్టాండ్ బై, బాలుర ఆర్టిస్టిక్ విభాగంలో గోల్డ్ మెడల్, బాలికల ఆర్టిస్టిక్ విభాగంలో గోల్డ్ మెడల్, బాలుర రిథమిక్ విభాగంలో గోల్డ్ మెడల్, బాలికల రిథమిక్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. త్వరలో మహారాష్ట్రలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే జాతీయ స్థాయి యోగాసన పోటీల్లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే 14 స్థానాలకు నూజివీడు ట్రిపుల్ ఐటి యోగశాల విద్యార్థులే 11 స్థానాలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. బాలుర విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు పి.షణ్ముఖవికాస్, సిహెచ్.దీపక్‌నాయుడు, బిఆర్‌డిఎస్.శివకుమార్, జ్ఞానేశ్వర్‌రెడ్డి, జె.విష్ణువర్ధన్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో జి.స్వర్ణలత, కె.హరిత, పి.హారిక, ఎంవి.ఐశ్వర్య, ఎ.లక్ష్మీప్రవీణ, పి.క్రాంతి దీపిక ఎంపికయ్యారు. విజేతలను ఉమ్మడి కృష్ణా జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ రవికాంత, నూజివీడు ట్రిపుల్ ఐటి సంచాలకులు ఆచార్య అమరేంద్ర, పరిపాలనాధికారి లక్ష్మణ్, పియుసి కో-ఆర్డినేటర్ దుర్గాబాబు అభినందించారు. యోగా శిక్షకుడు అక్కినేని సత్య శ్రీధర్‌ను అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

ముసునూరు : తమ విద్యార్థులు యోగా పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కొండాబత్తుల ప్రవీణ తెలిపారు. ఈ నెల 28వ తేదీన నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో అండర్-బి 17 విభాగంలో ఎ.శ్రీవల్లి, మహాలక్ష్మి, శ్రీవాణి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు, అండర్-బి 14 విభాగంలో జె.హారిక, ఎల్.అను, కె.తాప్సీ జిల్లా స్థాయి ఆటలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆమె తెలిపారు. నెల్లూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు వారు హాజరవుతారని చెప్పారు. విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఇసుక రీచ్‌ల పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

తమ్మిలేరు పరివాహక ప్రాంతాలైన ఇసుక రీచ్‌లను నూజివీడు డిఎస్‌పి కెఎన్‌వివి.ప్రసాద్ బుధవారం పరిశీలించారు. మండలంలోని వలసపల్లి, ఎల్లాపురం, బలివే, గుళ్లపూడి, లోపూడి గ్రామాల్లోని ఇసుక రీచ్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరత్వరగా ఎక్కువ ట్రిప్పులను తోలే క్రమంలో ప్రమాదాలకు గురి కాకుండా ఉండాలని సూచించారు. ట్రాక్టర్ల డ్రైవర్లు 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల లోపు ఉండి, లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ఆయనతో పాటు నూజివీడు రూరల్ సిఐ కె.రామకృష్ణ, ఎస్ఐ ఎం.చిరంజీవి ఉన్నారు.

కృష్ణను కలిసిన ఆశీర్వాదం

ఉంగుటూరు : ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణను హైదరాబాదులో కలిసి పలు సమస్యలపై వినతిపత్రం ఇచ్చినట్లు టిడిపి ఉంగుటూరు మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడు ఎన్.ఆశీర్వాదం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాదిగ ఉప కులాలకు రిజర్వేషన్లు సాధించడంలో మంద కృష్ణ చేసిన కృషిని అభినందించామని తెలిపారు.

పాస్‌పోర్టు పడిపోయినది

పశ్చిమగోదావరి జిల్లా ఓడూరు గ్రామానికి చెందిన **గుడాల వెంకటేశ్వర్లు, తండ్రి : సూర్యారావు** అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. ఓడూరు నుండి పెనుమంట్ర జిరాక్స్ కొరకు వెళుతుండగా నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది **పాస్‌పోర్టు నెంబర్ : W0523016** గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

**గుడాల వెంకటేశ్వర్లు, తండ్రి : సూర్యారావు,
డోర్ నెం : 4 - 136, న్యు కాలనీ
ఐ.పి.యస్.చర్చ్, ఓడూరు, పెనుమంట్ర
మండలం, ప.గో.జిల్లా. పిన్ : 534126
సెల్ : 9908169937**

దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం పట్టణ కాపురస్తులు **కత్తి కాశీరావు** గారి కుమారుడైన మా క్లయింట్ **కత్తి పూల రత్తయ్య** అను వారు మాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం భీమడోలు ఎస్ఆర్ఓ కు చెందిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం.**3191/1997** మరియు డాక్యుమెంట్ నెం.**3193/1997 ది.17-10-2024**న వారి ఇంటివద్ద నుండి ఆటోలో వెళ్తుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. ఈ ఆస్తిని ఎస్ బి ఎఫ్ సి సంస్థ నందు తనఖా పెట్టబడి ఉన్నది. సదరు ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

బొమ్మిడి ఖంజిత లక్ష్మి B.Com., LL.M.,
బొమ్మిడి సన్నీరాజ్ B.E., LL.B.,, **అడ్వొకేట్స్**
**యామిజాల వారి వీధి, భీమవరం - 534201.
సెల్: 7981915665, 8882464906**

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)- కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 319/2023

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం
...వాది
అండ్
తోలేటి దమయంతి అండ్ అనదర్
...ప్రతివాది/ప్రతివాదులు

సమన్సుటు:
D-1: తోలేటి దమయంతి, W/o. నర్సింహరావు, డోర్ నెం. 4-115, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: మారిశెట్టి వీరాస్వామి, S/o. అంజమూర్తి, డోరు నెం. 4-108, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 01-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 30-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)- కమ్-జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 33/2024

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం
...వాది
అండ్
మిద్దే స్వప్న అండ్ అనదర్
...ప్రతివాది/ప్రతివాదులు

సమన్సుటు:
D-1: మిద్దే స్వప్న, W/o. లక్ష్మణరావు, డోర్ నెం. 3-99, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.
D-2: బోళ్ళ సుబ్రహ్మణ్యం, S/o. మాధవరావు, 4వ బ్లాక్, గగ్గిపర్రు, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) -కమ్-జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 01-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 30-10-2024 సెల్: 98662 59514